క్లుప్తంగా

హుండీ లెక్కింపు



వెంకటాపురం(కె) : మండల కేంద్రంలోని పద్మావతి, అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ కవిత సమక్షంలో అర్చకులు, సిబ్బంది హుండీ లెక్కింపు నిర్వహించారు. రూ.1,29,438 ఆదాయం వచ్చిందన్నారు.

తాగునీటికి ఇబ్బంది రావొద్దు



వెంకటాపురం(కె) : వేసవిలో తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా అధికారులు చర్యలను చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి అప్పల నాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో తాగునీటికి ఎలాంటి సమస్య రావొద్దన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ లక్ష్మి రాజయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఏ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పోలీసుల తనిఖీ

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాల్లో స్నైపర్ డాగ్ సాయంతో బుధవారం ఎస్సై తాజొద్దీన్, పోలీసులు తనిఖీ చేశారు. ఏజెన్సీలో యువత మాదక ద్రవ్యాలకు బానిసై చెడు మార్గాలను అనుసరిస్తున్నారన్నారు. అనుమానితులు, అపరిచిత వ్యక్తులు వస్తే ఎట్టి పరిస్థితుల్లో ఆశ్రయం ఇవ్వొద్దని అన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల నడవడికపై దృష్టి పెట్టాలని, వేసవి సెలవుల్లో మైనర్లకు వాహనాలు ఇస్తే వారిపై కేసులు నమోదు అవుతాయని ఎస్సై హెచ్చరించారు.

పునఃప్రారంభానికి శివాలయం సిద్ధం

వాజేడు : శివాలయాన్ని పునఃప్రారంభించేందుకు స్థానికులు సిద్ధమవుతున్నారు. ఆలయాన్ని తెరిపించడానికి ముందుకు వచ్చిన యువత మండల కేంద్రంలోని శివాలయం పరిసరాలను గ్రామస్తులతో కలిసి శుభ్రం చేశారు. బుధవారం ఆలయ ధర్మ కర్త వద్దకు వెళ్లగా ఆయన గుడి వద్దకు వచ్చారు. ఆలయాన్ని ప్రారంభించడానికి శాస్త్రోక్తంగా ప్రత్యేకంగా చేయాల్సిన పూజల కోసం పూజారులతో మాట్లాడుతానని చెప్పినట్లు స్థానికులు, యువకులు పేర్కొన్నారు.

భూ సేకరణ సర్వే

కాటారం : చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా కాల్వల నిర్మాణానికి మండలంలోని మల్లారంలో బుధవారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు భూ సేకరణ సర్వే నిర్వహించారు. భూ సేకరణకు సంబంధించిన నిర్వాసిత రైతులతో మాట్లాడారు. ఎంత మేర భూమి అవసరం అవుతుంది, కాల్వల నిర్మాణ ప్రతిపాదన రైతులకు వివరించారు. సర్వేకు రైతులు సహకరించాలని అధికారులు కోరారు. పలువురు రైతులు తమ అభ్యంతరాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ ఈఈ ఉపేందర్, ఏఈ వెంకన్న, ఆర్ఐ వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాసం పేరుతో మోసం'



భూపాలపల్లి రూరల్ : రాజీవ్ యువ వికాసం పేరుతో నిరుద్యోగ యువకులను కాంగ్రెస్ మోసం చేస్తోందని ఎమ్మార్పీఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో రాజయ్య మాట్లాడారు. రేషన్‌కార్డులు లేకుండా దరఖాస్తు చేయడం ఎలా అని ప్రశ్నించారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంలో ప్రభుత్వ ం విఫలమైందన్నారు. హరీష్, మంత్రి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

'పది'తోనే ఫుల్‌స్టాప్..

ఉన్నత చదువులకు దూరంగా కాలేజీ విద్యార్థులు

- అందుబాటులో లేని ఇంటర్ కళాశాల
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



గూర్రేవులలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు

కన్నాయిగూడెం : మండలంలోని పదో తరగతి చదివిన పాఠశాల విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. పై చదువులు చదవాలన్న తపన ఉన్నా అందుబాటులో ఇంటర్, డిగ్రీ కళాశాలలు అందుబాటులో లేవు. దీంతో సుదూర ప్రాంతాలకు వెళ్లలేక చాలా మంది విద్యార్థులు చదువును పదోతరగతి తోనే స్వస్తిపలికి పనులకు పరిమితమవుతున్నారు. ఏజెన్సీ మండలంలో నాలుగు జెడ్పీ ఉన్నత పాఠశాలలో వందల మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. అందులో 25 శాతం కూడా ఇంటర్‌లో చేరడం లేదు. దీనికి కారణం మండలంలో ఇంటర్ కళాశాల లేకపోవడమే. దూరం వెళ్లి చదవాలంటే ఆర్థిక భారం వెంటాడుతోంది. దీంతో కొంత మంది బాలురు ఏటూరునాగారం వెళ్లి చదువుతున్నారు. అయితే బాలికలను మాత్రం దూరంగా పంపించేందుకు తల్లిదండ్రులు ఇష్టపడడం లేదు.

పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు

మండలంలో ప్రతీ ఏటా ఎంతోమంది విద్యార్థులు పదోతరగతి చదివి పై తరగతులకు దూరం పోలేక చదువును మధ్యలోనే ఆపి కూలీపనులకు వెళ్లిపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇంటర్, డిగ్రీ కళాశాలలపై దృష్టి సారించి ఏర్పాటు దిశగా పనులు చేయడం లేదని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులను కలిసి విన్నవించిన ఫలితం శూన్యమే. ఎవరూ కూడా తమ సమస్యను పట్టించుకోవడం లేదని పలు విద్యార్థి సంఘాలు నాయకులు చెబుతున్నారు. ఇప్పటికైనా స్పందించి మండలంలో ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నాలుగు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు

మండలంలో 11గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ పాఠశాల, గుర్రేవుల, ముప్పనపల్లి, అదే గ్రామంలో కేజీబీవీ పదోతరగతి వరకు చదువును కొనసాగిస్తున్నారు. ఈ నాలుగు పాఠశాలల్లో 2024–25 అకడమిక్ సంవత్సరంలో 63 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. కన్నాయిగూడెం మండలం జిల్లాలోనే చిట్టచివరిది. ఇక్కడ పూర్తిగా నిరుపేద కుటుంబాలతో వ్యవసాయాధారిత ప్రాంతం కావడంతో అనేక మంది రైతు కుటుంబాలు ఉంటాయి. పిల్లలను చదివించడం కొంత భారంగా ఉన్న చదువులేక పోతే నేటి సమాజంలో ఇబ్బందులు తప్పడం లేదనే తపనతో అందుబాటులో ఉన్న పాఠశాలలల్లో పదోతరగతి వరకు చదిస్తున్నారు. ఆ తర్వాత స్తోమత లేకపోవడంతో పై చదువులకు పంపకుండా ఆపేస్తున్నారు. అందుబాటులో ఇంటర్, డిగ్రీ కళాశాలలను నెలకొల్పాలని కోరుతున్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి



మాది వెనకబడిన మండలం..అన్ని కుటుంబాలు పేద కుటుంబాలు, కూలి పనులు చేసుకోని జీవనం సాగిస్తాం. ఇక్కడా జూనియర్ కాలేజీ లేక చాలా మంది విద్యార్థులు పై చదువులకు వెవెళ్లలేక పది తర్వాత చదువును ఆపి వేస్తున్నారు. ఇక్కడా ఏర్పాటు చేస్తే అందరికి అందుబాటులో ఉంటది. అధికారులు చొరవ తీసుకోని జూనియర్ కాలేజీని ఏర్పాటు చేయాలి.

– దుర్గం రాజు కుమార్, స్థానికుడు

ఆడపిల్లలు చదువు ఆపేస్తున్నారు



ఆడపిల్లలు బయటికి వెళ్లి చదవడం లేదు.. పది తర్వాత చదువును బంద్ చేస్తున్నారు. మండలంలో జూనియర్ కాలేజీ లేక చాలా మంది ఆడపిల్లలు చదువును పది తర్వాత ఆపి కూలీ పనులకు పోతున్నారు. ఇక్కడా అందుబాటులో ఉంటే చదువును కొనసాగించే అవకాశం ఉంటుంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోని మండల కేంద్రంలో జూనియర్ కాలేజీని ఏర్పాటు చేయాలి

– నరెడ్ల అశోక్, స్థానిక నాయకుడు

విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు



నూతన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏఈ రవి, రైతులు

ములుగు రూరల్ : విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని విద్యుత్‌శాఖ ఏఈ రవి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జగ్గన్నపేట పంచాయతీ పరిధి చిన్నగుంటూరుపల్లిలో ఓల్టేజ్ సమస్యలు తలెత్తకుండా 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ బిగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓవర్ లోడ్ కారణంగా విద్యుత్ నియంత్రికలు గుర్తించి వాటి స్థానాల్లో అధిక కెపాసిటి కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పెగడపల్లి, అంకన్నగూడెం గ్రామాలలో 63 కేవీఏ, జగ్గన్నగూడెంలో 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను బిగించామని అన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిస కావొద్దు

డీఎస్పీ రవీందర్



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రవీందర్

ములుగు : విద్యార్థులు వ్యసనాలకు బానిస కావొద్దని ములుగు డీఎస్పీ నలవాల రవీందర్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సాధన ఉన్నత పాఠశాలలో ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై పదోతరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ శంకర్‌తో కలిసి డీఎస్పీ రవీందర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎస్సై ఇమాన్యుయేల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సునీతా విలియమ్స్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



కరపత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ములుగు రూరల్ : భారత సంతతికి చెందిన అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పత్తిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ప్రతిభా బాలల సంఘం ఆధ్వర్యంలో జయహో సునీతా విలియమ్స్ అని నినాదాలు చేశారు. అనంతరం కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే శాస్త్రీయ భావనలను పెంపొందించుకొని భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదగాలని అన్నారు. 9 నెలల 14 రోజుల అనంతరం సునీతా విలియమ్స్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి భూమికి చేరుకున్న యాత్ర దృశ్యాలను ప్యానల్ బోర్డులో విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్, ఉపాధ్యాయులు రాజు, మురళీధర్, శ్రీనివాస్, రజిత, శివరాం, నర్సింహాచారి, రవి, స్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ పిచికారీపై అవగాహన

మొగుళ్లపల్లి : మండలంలోని రంగాపురంలో జేబీడీ సొసైటీ ఆధ్వర్యంలో వరి పంటలో డ్రోన్స్‌తో మందులను ఉచితంగా పిచికారీ చేయించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు డ్రోన్ పిచికారీతో ఉపయోగాలను భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ రాజేంద్రనగర్ హైదరాబాద్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.గంగయ్య రైతులకు వివరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సిరికొండ తిరుపతిరావు, రైతులు రాజేశ్వర్ రావు, కిషన్ రావు, తిరుపతిరావు, సంతోష్ రావు, నిరంజన్, భూమారావు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



వాజేడు ఉన్నత పాఠశాల

వెంకటాపురం(కె) /గోవిందరావుపేట/వాజేడు: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెంకటాపురం(కె) ఎంఈఓ సత్యనారాయణ బుధవారం తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 135, చిరుతపల్లి ఆశ్రమ పాఠశాలలో 140 మంది మొత్తం 275 మంది పరీక్షలు రాస్తున్నట్లు చెప్పారు.అలాగే గోవిందరావుపేట మండలంలో రెండు సెంటర్లు జెడ్పీహెచ్‌ఎస్ పస్రా నాగారం సెంటర్‌లో 150 మంది, గోవిందరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల సెంటర్‌లో 139 మంది విద్యార్థులు మొత్తం 289 మంది హాజరవుతున్నారని ఎంఈఓ గొంది దివాకర్ అన్నారు. ఉదయం 9:30నుంచి మధ్యాహ్నం 12:30 నిమిషాల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇదిలా ఉండగా వాజేడు ఉన్నత పాఠశాల నుంచి 21 మంది, పేరూరు ఆశ్రమ పాఠశాల నుంచి 43 మంది, ధర్మవరం ఉన్నత పాఠశాల నుంచి 14 మంది, కేజీబీవీ నుంచి 18 మంది, పెద్ద గొల్లగూడెం బాలికల ఆశ్రమ పాఠశాల నుంచి 27 మంది మొత్తం 123 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో బాలికలు 70 మంది బాలురు 53 మంది ఉన్నారు.

తాగునీటి నల్లాల పరిశీలన



భూపాలపల్లి అర్బన్ : వేసవి నేపథ్యంలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పర్యటించి కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పుల్లూరి రామయ్యపల్లి గ్రామంలో పర్యటించిన కమిషనర్ మాట్లాడుతూ.. వేసవికాలంలో నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని ఎలాంటి ఇబ్బందులు రాకుండా వాటర్ లీకేజీలు లేకుండా మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. నీటిని వృథా చేయకుండా చూసుకోవాలని, నల్లాలకు మోటార్లు పెట్టవద్దన్నారు. కమిషనర్ వెంట అసిస్టెంట్ ఇంజనీర్ మానస, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండల తీవ్రత దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

మంత్రి సీతక్క



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ములుగు : కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు స్వర్గీయ నల్లెల కుమారస్వామి జ్ఞాపకార్థం స్థానిక ఆస్పత్రి ఎదుట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క హాజరై ప్రారంభించారు. అలాగే జిల్లాకేంద్రంలోని గాంధీ పార్కు ఎదుట గ్రామ పంచాయతీ ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ దివాకరతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరిగి వడగాలులు వీస్తున్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఎండలో బయటకు రావొద్దన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, డీపీఓ దేవరాజ్, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ ర హీం, ఈఓ పెంట రఘు, మండల, గ్రామ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

బస్టాండ్ నిర్మాణ పనులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

ములుగు రూరల్ : ములుగు జిల్లాకేంద్రంలో నూతన బస్టాండ్ నిర్మాణ పనులను త్వరగా చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాకేంద్రంలో బస్టాండ్ నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేసినప్పటికీ మూడు నెలలు గడుస్తున్న పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. నిత్యం వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్టాండ్‌లో సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీంతో పాటు ఏటూరునాగారంలో బస్‌డిపో పనులను పూర్తి చేసి ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బైకాని మహేందర్, విజేందర్, పాపిరెడ్డి, సంపత్, రాజ్‌కుమార్, పవన్‌కుమార్, సురేష్ పాల్గొన్నారు.

గొత్తికోయగూడెంలో సమస్యలపై దృష్టి



గిరిజనులతో మాట్లాడుతున్న రఘు

ఏటూరునాగారం : మండలంలోని పోలకమ్మ వాగు గొత్తికోయగూడెం గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. బుధవారం మండలంలోని పోలకమ్మ వాగు గూడెంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించి గిరిజనులతో మాట్లాడారు. మంత్రి సీతక్క దృష్టికి సమస్యలను తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో మండల కిసాన్ సెల్ అధ్యక్షులు సోదారి రామయ్య, మండల ఎస్సి సెల్ అధ్యక్షులు కర్నె సత్యం, మండల బీసీ సెల్ అధ్యక్షులు కుదురుపాక శ్రీనివాస్,సోదారి హరీష్, మాజీ వార్డు సభ్యుడు కొండగొర్ల నర్సింహులు, జోడే నర్సయ్య,రవి, చిన్నన్న, జాడి రామయ్య, గజ్జెల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా పరీక్షలు రాయండి



మాట్లాడుతున్న హెచ్‌ఎం ఆనందరావు

వాజేడు : పదో తరగతి విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు, వాజేడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనందరావు అన్నారు. మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలో బుధవారం పదోతరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్వరూప్ సింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

వందశాతం ఫలితాలే లక్ష్యం



చిన్నబోయినపల్లి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు



స్టడీమెటీరియల్ అందజేస్తున్న నాగేశ్వర్‌రావు

- గిరిజన విద్యార్థులకు ప్రత్యేక మెనూ
- జిల్లాలో 816 గిరిజన విద్యార్థులు

ఏటూరునాగారం : పదో తరగతి వార్షిక పరీక్షల్లో గిరిజన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఆ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రత్యేక మెనూతోపాటు బోధనకు మొగ్గు చూపుతున్నారు.విద్యార్థులను నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కసరత్తు చేస్తున్నారు.

ఉచితంగా స్టడీ మెటీరియల్..

పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులకు ఆల్ ఇన్ వన్, కంపాక్స్ బాక్స్, పరీక్ష ప్యాడ్లతోపాటు పెన్నులు, పెన్సిల్స్‌ను ఉచితంగా అందజేశారు. పరీక్షలను రాసే ప్రతి విద్యార్థికి మెళకువ పాటించే విధంగా సబ్జెక్టు టీచర్లతో సూచనలు ఇప్పించారు.

రూ.20తో ప్రత్యేక అల్పాహారం

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక బోధనతోపాటు భోజనం, అల్పాహారాన్ని ఐటీడీఏ ద్వారా అందిస్తోంది. ఒక్కో విద్యార్థి కోసం రోజుకు రూ.20లు ఖర్చు చేసి వారికి ఉదయం బూస్ట్, సాయంత్రం అల్పాహారం, రాత్రి టీ అందజేస్తున్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చర్యలు



జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణశాతం గత ఏడాది కంటే మరింత పెరిగే విధంగా చూస్తున్నాం. ప్రత్యేక బోధనతోపాటు అల్పాహారం, ప్రత్యేక మెనూ అందజేస్తున్నాం. పదో తరగతి పరీక్షలు రాసేవారికి ప్రత్యేక శిక్షణ అందజేశాం.

– పోచం, డీడీ, ఐటీడీఏ, ఏటూరునాగారం

వడ్డీలేని రుణాల పంపిణీపై హర్షం

మొగుళ్లపల్లి : మహిళలకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం వెలుగు మండల సమాఖ్య మొగుళ్లపల్లి కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చిత్రపటాలకు మహిళలు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ రఫీ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య ఏపీఎం రవి వర్మ మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం బ్యాంకుల నుంచి వడ్డీలేని రుణాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 657 సంఘాలకు రూ 1,06,97,294 రుణాలు రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది బత్తిని శ్రీనివాస్, గాజుల బాబురావు, బత్తిని ప్రవీణ్, వీఓఏలు రమ, రమ్య, పావని, లలిత, తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లు ఆమోదంతో సంబురాలు



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వెంకటాపురం(ఎం) : ఎస్సీ వర్గీకరణ బిల్లును ఉభయసభలు ఏకగ్రీవంగా ఆమోదించడంతో మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు బాణసంచా కాల్చుతూ సంబురాలు చేసుకున్నారు. 30 ఏళ్ల పోరాటం ఎట్టకేలకు ఫలించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు చంటి భద్రయ్య, కాడపాక శ్యాం, మోరె లింగస్వామి, దొమ్మటి రమేష్, గడ్డమీది దేవేందర్, గాజుల శ్రీనివాస్, భద్రయ్య, వంశీ, భాస్కర్, రవీందర్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బాణసంచా కాల్చి సంబురాలు చేసుకుంటున్న నాయకులు

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

వెంకటాపురం(కె) : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా ఎస్సీ వర్గీకరణ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదించడంతో రాహుల్ గాంధీ, భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, శివ, సాయి, చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ రాంబాబు, తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రేగొండ : ములుగు జిల్లా అబ్బాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు బుధవారం మండలంలోని కొడవటంచలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1999–2000 పదో తరగతి చదివిన విద్యార్థులు సిల్వర్ జూబ్లీ కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు అందరూ ఒకే వేదికపై కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులు కుమార్, ప్రభాకర్, కిషన్, శంకర్, లింగమూర్తి, రాజేందర్, రాజమహేందర్, శ్రీను, సంపత్, లత, పద్మ, శ్రీమత తదితరులు పాల్గొన్నారు.